క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో గల దుర్గమ్మ తల్లి దేవాలయం ప్రథమ వార్షికోత్సవంలో శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నితీశా శ్రీకాంత్, సీనియర్ నాయకులు తులసిరెడ్డి, రాజు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట

కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని అడ్డగుట్టలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకుపెద్ద పీట వేస్తామని తెలిపారు. ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తుల కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు వల్లభనేని సుబ్బారావు, వేణు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, పరమేశ్వర్, మాధవ్, నిరంజన్‌గౌడ్, రాంకుమార్ పాల్గొన్నారు.

మాకూ అవకాశమివ్వండి..



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తున్న గజ్జెల యోగానంద్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం బీజేపీ అభ్యర్థులుగా తమకు అవకాశమివ్వాలంటూ ఆ పార్టీ నాయకులు గజ్జెల యోగానంద్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కొరదాల నరేష్‌లు శనివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని, పార్టీ గెలుపు కోసం పని చేస్తానని యోగానంద్ పేర్కొన్నారు. కాగా శేరిలింగంపల్లి బీజేపీ ఎమ్మెల్యే టికెట్ పార్టీ తనకే కేటాయిస్తుందనే నమ్మకం ఉందని, గత 15 సంవత్సరాలుగా పార్టీకి నమ్మకంగా పనిచేస్తున్నందుకు తనను గుర్తిస్తుందని నరేష్ అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎస్. హరికృష్ణ, నర్సింగ్‌రావు, కమలాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, బీసీ మోర్చా సీనియర్ నాయకులు దుర్గా ప్రసాద్, శంకర్, మహిళా మోర్చా నాయకురాలు లలిత రెడ్డి, మమత పాల్గొన్నారు.



రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు అందిస్తున్న డాక్టర్ కొరదాల నరేష్

సైకిల్‌పై ప్రొద్దుటూరు-ప్రగతిభవన్



బంజారాహిల్స్: ప్రొద్దుటూరుకు చెందిన పెయింటింగ్ ఆర్టిస్ట్ తుపాకుల రామాంజనేయరెడ్డి వారం రోజుల పాటు సైకిల్‌పై ప్రయాణించి సీఎం కేసీఆర్‌పై తన అభిమానాన్ని చాటుకున్నారు. ప్రగతి భవన్‌లో శనివారం రామాంజనేయులు రెడ్డి మంత్రి కేటీఆర్‌ను కలుసుకొని కేటీఆర్‌తో పాటు, సీఎం కేసీఆర్ చిత్రపటాలను అందజేశారు. 20 రోజుల పాటు కష్టపడి కాన్వాస్‌పై అక్రిలిక్‌తో పాటు గండికోట మట్టితో మోనోకలర్‌ను చిత్రించిన సీఎం కేసీఆర్ ప్రత్యేక పెయింటింగ్‌ను తానే స్వయంగా గీశానని మంత్రికి తెలియజేశారు. వాటిని ప్రత్యేకంగా ఫ్రేమ్‌లో కట్టించి ప్రొద్దుటూరు నుంచి సైకిల్‌పై బయల్దేరి వారం రోజులు ప్రయాణించానని తన మిత్రులతో కలిసి వచ్చినట్లు తెలిపారు. ఈ ఆర్టిస్ట్ బృందాన్ని మంత్రి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ తరఫున పెయింటింగ్‌లు స్వీకరించి వారిని అభినందించారు.





మియాపూర్ డివిజన్ పరిధిలోని రోడ్ల దుస్థితి

గుంతలు.. అవస్థలు





మియాపూర్: రోడ్లపై అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. గుంతలు పూడ్చేందుకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం కనపడడంలేదు. రోడ్ల నిర్మాణ, మరమ్మతుల సమయంలో నాణ్యత పాటించకపోవడంతో మున్నాళ్లకే గుంతలు పడుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- చందానగర్ సర్కిల్ మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషినగర్, ప్రశాంత్‌నగర్, మయూరీనగర్, లక్ష్మీనగర్, జేపీనగర్, మక్తమహబూబ్ పేట్, దీప్తీశ్రీనగర్ ప్రాంతాలలోని రహదారులకు మరమ్మతులు చేశారు. ఐతే ఇటీవల కురిసిన వర్షాలకు మరమ్మత్తులు చేసిన రోడ్లు గుంతలుగా మారాయి. గుంతలు ఏర్పడి కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు ఆ రోడ్డు వెంబడి వెళ్తూ జారి పడే అవకాశం ఉంది.

గుంతలు పూడ్చేది ఇలా ..?

- రోడ్లపై గుంతలను బట్టి చతురస్తం లేదా దీర్ఘ చతురస్రాకారంలో తవ్వి వ్యర్థాలను తొలగించి అందులో కంకర మిశ్రమాన్ని వేసి సమాంతరంగా చదును చేయాలి.
- తారు, కంకర మిశ్రమం వేసే ముందు ఆ గుంతల్లో నీరు, తడి ఉండకుండా చూసుకోవాలి.
- ఈ విధంగా చేయడం ద్వారా మరమ్మతులు చేసిన చోట రోడ్డు దృఢంగా ఉంటుంది. త్వరగా పాడైపోయే అవకాశం ఉండదని సీనియర్ అధికారులు సూచిస్తున్నారు.

మరమ్మతులు చేస్తున్నారిలా ..?

- ట్రాక్టర్లు, ఇతర వాహనాలలో తారు, కంకర మిశ్రమాన్ని తీసుకొస్తున్నారు. ముగ్గురు కార్మికులు వచ్చి రోడ్డు వెంబడి కనిపించిన గుంతలలో తారు, కంకర మిశ్రమాన్ని కుప్పలుగా వేసి పూడ్చేస్తున్నారు.
- తర్వగా చదును చేయడానికి కాళ్లకు ఉన్న బూట్లతో లేదా చెప్పులతో, వెంట తీసుకొచ్చిన పార సహాయంతో చదును చేసి వదిలేస్తున్నారు.
- గుంతలలో నీళ్లు ఉన్న కూడా అలాగే కంకర మిశ్రమాన్ని వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల వర్షం వచ్చినా, పెద్ద పెద్ద వాహనాలు వాటిపై నుండి వెళ్లడంతో మరమ్మతులు చేసిన గుంతలు కంకర తేలిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనకు రాకపోవడం, కిందిస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత లేక గుంతలు పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైటెక్స్‌లో ప్రారంభమైన బీఎన్ఐ గోనాట్-2023



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఎన్ఐ జాతీయ డైరెక్టర్ హేము సువర్ణ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శనివారం బీఎన్ఐ (బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్) గోనాట్ 2023 కార్యక్రమాన్ని బీఎన్ఐ జాతీయ డైరెక్టర్ హేము సువర్ణ ప్రారంభించారు. బీఎన్ఐ హైదరాబాద్ రీజియన్ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రెండురోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినార్‌లో వ్యాపార దిగ్గజాలు, వక్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఐడియల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ ఆయూస్ బన్సాల్, బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు ఉత్పత్తులను ప్రారంభించారు. 200 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కామధేను ఎస్టేట్స్ పార్టనర్ స్వాతి, పెర్సమ్ డైరెక్టర్ టి.రాధాకృష్ణ, బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ కోచ్ దీపిక చలసాని, సీలింగ్ క్రూ పార్టనర్ మయాంక్ హరోడియా, శ్రీ అదిత్య వర్షిణీ ఎస్టేట్స్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'లేక్ క్లీన్ అప్ డ్రైవ్'



రాయదుర్గం: నిత్యం కంప్యూటర్లు..పుస్తకాలతో కుస్తీలు పట్టే విద్యార్థులు కాస్తా వీకెండ్స్‌లో సేవా దృక్పథాన్ని చాటుతూ 'లేక్ క్లీన్ అప్ డ్రైవ్' చేపట్టారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ సెల్ విభాగం, హెచ్‌సీయూ పారిశుద్ధ్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వైట్‌రాక్స్, చెరువు వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళు, వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ భీంసింగ్ మాట్లాడుతూ వైట్‌రాక్స్ వద్ద ఉన్న స్థలాన్ని దుర్వినియోగం చేయడం వల్ల క్యాంపస్ అటవీ ప్రాంతంలోని జంతువులు, పక్షులు గాయపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ శానిటేషన్ విభాగం అధికారులు వెంకటదాస్, జునైద్, సోనీ, నితిన్, అభిలాష్, శంకర్‌నాయక్ బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల బృందం పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ తదితరులు

మియాపూర్: ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీల్లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కంటి పరీక్షలు చేపట్టారు. సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్ భిక్షపతి యాదవ్, ట్రస్ట్ సెక్రటరీ రవికుమార్‌యాదవ్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్తీ, కాలనీలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వారికి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్, విజయలక్ష్మీ, రమేష్, అరుణ పాల్గొన్నారు.

పండగలను ప్రశాంతంగా చేసుకోవాలి

పటాన్‌చెరు టౌన్: పండగలను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ లాలూనాయక్ అన్నారు. శనివారం సాయంత్రం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు వారి వారి అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ... రహదారిని దిగ్బంధం చేసి మండపాల ఏర్పాటు చేయవద్దని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, బీఆర్ఎస్ పట్టణ కమి టీ అధ్యక్షులు అఫ్జల్, ముస్లిం నాయకులు లియాఖత్ అలీ, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగరాజ్ యాదవ్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, సీఐ లాలూనాయక్, క్రైమ్ సీఐ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ వలలో ముగ్గురు

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడ్డ ముగ్గురు రూ.లక్ష 40 వేలు, మరో వ్యక్తి రూ.39 వేలు, గృహిణి రూ.47 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆగస్టు 11వ తేదీన ఆన్‌లైన్ జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. పెట్టిన నగదుకు కమిషన్ ఇస్తామని చెప్పడంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి పలు దఫాలుగా రూ.ఒక లక్ష 40 వేలు పెట్టాడు, తీరా పెట్టిన నగదు పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో స్పందించలేదు దీంతో బాధితుడు తాను మోసపోయిన్నట్టు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేసి అనంతరం శనివారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

5 లక్షలు లోన్ ఇస్తామని...

అమీన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి కి ఆగస్టు 18వ తేదీన 5 లక్షల లోన్ ఇస్తామని ఒక మెసేజ్ వచ్చింది.దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేశాడు. అనంతరం లోన్ మంజూరు కోసం రూ.39 వేలు చెల్లించాలని చెప్పడంతో బాధితుడు చెల్లించాడు. తిరిగి లోన్ ప్రాసెస్ కోసం మరల నగదు చెల్లించాలని చెప్పడంతో అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు.

ఆన్‌లైన్ జాబ్ అంటూ..

అమీన్‌పూర్ ఇక్రిశాట్ కాలనీకి చెందిన గృహిణికి జూన్ 28వ తేదీన ఆన్‌లైన్ జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ గృహిణి తన వివరాలను నమోదు చేసి, అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేసి పెట్టిన నగదుకు కమిషన్ ఇస్తామని చెప్పడంతో రూ. 47 వేలు ఇన్వెస్ట్ చేసింది. గృహిణి పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు దీంతో బాధితురాలు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాయినగర్ కాలనీలో బస్తీ దర్శన్



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్ప నాగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ అన్నారు.శనివారం డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో బస్తీ దర్శన్‌లో భాగంగా కార్పొరేటర్ పర్యటించారు. ఇటీవలే కాలనీలో డ్రైనేజ్ పైప్ లైన్ వేయడం వల్ల రోడ్డు అస్తవ్యస్తంగా మారిందని నూతన సీసీ రోడ్డు పనులను వారం రోజుల్లో ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, భాస్కర్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి ,రాజు, నారాయణ, అర్చన, మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లోని శ్రీ ఓంకారేశ్వర శివాలయం, భక్త మార్కండేయ దేవాలయం ప్రథమ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, శ్రీధర్‌రెడ్డి, విఠల్, అనంత రాములు, ఆంజనేయులు, సాంబశివుడు, సుదర్శన్, నర్సింహ, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

12మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురు, శుక్రవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శనివారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 11 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, మరో కరికి రూ. 3 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఆటో ఢీకొని మహిళ మృతి



మియాపూర్: ఆటో ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శేరిలింగంపల్లిలోని గోపీనగర్‌లో సంజీవచారి, రుక్మిణి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడితో(65) ఉంటున్నారు. రుక్మిణి శేరిలింగంపల్లి గుల్‌మోహర్ పార్కులో ఓ ఇంట్లో పనిచేస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం 8 గంటలకు పనిచేసేందుకు వస్తుండగా గుల్‌మొహర్ పార్కువద్ద రోడ్డు దాటే క్రమంలో ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో కిందపడిన రుక్మిణికి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రుక్మిణి కుమారుడు నర్సింహాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతికి కారణమైన ఆటోను గుర్తించేందుకు సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పటేల్ చెరువుకట్ట మరమ్మతు పనుల పరిశీలన

మియాపూర్: మియాపూర్ పటేల్ చెరువుకట్ట మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువుకట్ట వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షకాలం నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా నాలాలకు రక్షణ చర్యల్లో భాగంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజి నారాయణ జయంతి

ఆల్విన్‌కాలనీ: ప్రజా కవి, స్వాతంత్ర సమరయోధుడు కాళోజి నారాయణ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజి నారాయణ గొప్ప ప్రజాకవి, తెలంగాణవాది అని పేర్కొన్నారు. కాళోజి 20 ఏళ్లకే దేశం కోసం జైలుకు వెళ్లడానికి వెనుకాడలేదని, ఆయన రచనలు మానవాళికి స్ఫూర్తి అని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కాళోజి జయంతిని తెలంగాణ రాష్ట్ర భాషా దినోత్సవంగా ప్రకటించారని ఆ మహనీయుడి జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ గుప్తా, గంధం రాములు, నాయినేని చంద్రకాంత్‌రావు, చాంద్ పాషా, రజినీకాంత్, ప్రభాకర్, శ్రీహరి, రాము, పద్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్ పటేల్ చెరువు కట్ట మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

లక్ష్యసాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలి

- విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు ఉండాలి
- రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఏకె ఖాన్



ఏకెఖాన్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్

రాయదుర్గం: విద్యార్థులు ఒక లక్ష్యంను ఏర్పరుచుకుని దాని సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఏకెఖాన్ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోయూజీసీ సూచనలపై ఆఫీస్ ఆఫ్ ది డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కొత్త విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'దీక్షారంభ్: స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్' (ఎస్ఐపీ) కార్యక్రమాన్ని నిర్వహించింది.అందులో భాగంగా ' ది ఆర్ట్ ఆఫ్ గోల్ సెట్'అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు ఉండాలని సూచించారు. సింబయాసిస్ కళాశాల న్యాయ విభాగాధిపతి డాక్టర్ అనితాసేబుల్ లింగం, చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ జైసీ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత చీరలతో హుందాతనం



కార్యక్రమంలో పాల్గొన్న యాంకర్ సుమ

బంజారాహిల్స్: భారతీయ సంస్కృతిలో చేనేత వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని ప్రముఖ యాంకర్ సుమ కనకాల అన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని జూబ్లీక్రాస్‌లో జీటీ వీవ్స్‌లో మనోహరి ఫెస్టివల్ కలెక్షన్స్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ... చేనేతకు ఎప్పుడూ వన్నె తగ్గలేదని నేటి తరం వారు ఎంతో ఇష్టంగా వాటిని ధరిస్తున్నారని అన్నారు. చేనేత అమ్మ చల్లని ఒడిని తలపిస్తుందన్నారు. చేనేత చీరలు మగువల హుందాతనాన్ని మరింత పెంచుతాయని అన్నారు. నిర్వాహకురాలు సౌజన్య పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో నృత్యార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం స్వరార్చనలో భాగంగా డాక్టర్ శోభరాజు శిష్యబృందం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రమ్, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రమ్, శ్రీ అన్నమాచార్య అష్టోత్తర శతనామావళి , గురుస్తుతితో ప్రారంభించారు. నృత్యజ్యోతి కూచిపూడి అకాడమీ గురువు మాధవి శిష్యబృందం వినాయకకౌతం, రాజశ్రీ శబ్దం, రామాయణ శబ్దం, త్యాగరాజ కృతి, మైసూరు వాసుదేవాచారి కీర్తన, దశావతార శబ్దం, గోపికృష్ణ రూపకంతో సందర్శకులను అలరించారు. కళాకారులు తనిష్క, హంసిని, యశ్విత, హిమశ్రీ, తపస్య, ఆర్తతి, శ్రేష్టలు పాల్గొన్నారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు.



శిల్పారామం.. సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్: కళాకారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం చెన్నైకి చెందిన భరతనాట్య కళాకారులు సమీక్ష, పూజ పుష్పాంజలి, అర్ధనారీశ్వరకృతి, జనని నినువినకృతి, తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు. సత్యకీర్తి నృత్యధామం గురువు దొడ్డబాలాజీ శిష్యబృందం మూషిక వాహనం, బ్రహ్మాంజలి, తరంగం, భామాకలాపం, లింగాష్టకం, దశావతారం, భోశంభో , రామాయణం, త్యాగరాయకృతి, శివాష్టకం, అన్నమయ్యకృతులు, బృందావన తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు కీర్తన, సంజన, సత్య, హంసిని, ఆర్థికసాయి, తన్విక, సమిక, అంజన, ఆద్య, హేమాన్షి, తనీషా పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలపై నిరసన

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సీపీఎం నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప కార్యదర్శి బాలపీరు అన్నారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో పెరిగిన నిత్యవసరాల ధరలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదేళ్ల పాలనలో నిత్యవసరాల ధరలు రెండింతలు పెరిగాయని, సామాన్యుడు ఇంటి అద్దె చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారంలోకి వస్తే ఉద్యోగ భర్తీ చేస్తామన్న ప్రభుత్వాలు హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో సుజాత, వీరయ్య, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.